క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం



కోస్గి రూరల్: గిరిజన విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు గుండుమాల్ మండల పరిధిలోని సారంగరావుపల్లిలో శుక్రవారం చేపట్టిన వైద్యశిబిరం విజయవంతమైందని వైద్యులు కిష్టమ్మ అన్నారు. ఈ శిబిరంలో 56మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశామన్నారు. సూపర్‌వైజర్ మణిమాల, ఎంపీహెచ్ఏ రవికుమార్, ఎల్‌టీ కృష్ణయ్య ఉన్నారు.

డ్రెయినేజీ నిర్మించాలి



మాగనూర్: మండలంలోని నేరడగంలో పలు కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థ లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. మరోవైపు డ్రెయినేజీ లేకపోవడంతో కొన్ని కాలనీలో నడవలేని దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆలయానికి మకర తోరణం బహూకరణ



నారాయణపేట: పట్టణంలోని బారంబావి నీలకంఠ దేవాలయానికి శుక్రవారం మకర తోరణాన్ని చౌదర్ గూడెంకు చెందిన ఘట్టప్ప జ్ఞాపకార్థంతో ఆయన కుమారులు స్వామివారికి భక్తితో బహూకరించారు. అంతకుముందు స్వామివారికి అభిషేకం, మహా మంగళహారతి తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, బాలరాజ్, రాములప్ప, బందిగి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



ధన్వాడ: మండలంలో రామకిష్టాయిపల్లిలో శుక్రవారం రైతులు ఆరబోసిన ధాన్యాన్ని ఏఈఓ జైన్‌సింగ్ పరిశీలించారు. ఈ మేరకు.. ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన వరిసైజు కనుక్కునే మిషన్ ద్వారా సన్న బియ్యమా లేక దొడ్డు బియ్యం అనేది వాటిని కొలిచే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు నిరంజన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్ళపల్లిలో శుక్రవారం స్వచ్ఛ భారత్‌పై ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఎంపీడీఓ గోవింద్‌రావు మాట్లాడారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలన్నారు. వారానికి ఒక్కసారి సమయం కేటాయించి ఇంట్లోని నిల్వ నీటిని పారబోసి నూతన నీటిని పట్టుకోవడం, పరిసరాలను శుభ్రం చేసుకోవడం వంటి వాటిపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా మార్చుటకు ప్రతి ఒక్కరు తోడ్పాటునందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నీలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.





పేటలో శాతవాహన కాలనీలో కార్తీకదీపాలతో యువతులు



మద్దూర్ ఆంజనేయస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న చిన్నారులు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

నారాయణపేట రూరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వైభవంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున నుంచే శైవక్షేత్రాల్లో భక్తులు పంచామృతాభిషేకం, బిల్వార్చనలు చేపట్టగా, మహిళలు ఉసిరిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, మహామంగళహారతి నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

- కోస్గి పట్టణంలోని శంభుని గుడి, ముక్తిపాడ్‌లోని శివాలయంలో, వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులు కార్తీకదిపోత్సవం వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలబ్రహ్మేశ్వర ఆలయంలో..

- నర్వ మండలంలోని పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పరమేశ్వరుడికి పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. ఈ మేరకు.. అర్చకులు భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో గౌరినోములు నిర్వహించారు.
- మాగనూర్ మండల కేంద్రంలో కార్తీక మాసం సందర్భంగా వివిధ ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.
- ఊట్కూరులోని ఈశ్వర్ మందీర్, మూకి బసవన్న ఆలయం, పులిమామిడి రామలింగేశ్వరం ఆలయం తదితర ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- మరికల్ మండలంలోని ఆయా గ్రామాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామస్తులు ఆలయాలను విద్యుత్‌కాంతులతో అలంకరించారు. ప్రతి ఇంట్లో కార్తీక పౌర్ణమి పూజలు చేశారు. అనంతరం టపాసులు పేల్చిపండగా సంబరాలు నిర్వహించారు.



నారాయణపేటలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



పెద్దకడ్మూర్‌లో..



అప్పంపల్లిలో..



కోస్గిలో దీపాలతో స్వామివారి ఆలయం



నారాయణపేటలో..

ప్రజలు సర్వేకు సంపూర్ణంగా సహకరించాలి



కోస్గిలో సర్వేను పరిశీలిస్తున్న నాయకులు



దామరగిద్దలో..

కోస్గి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా చేపట్టిన సర్వేను శుక్రవారం పలువురు బీసీ సంఘాల నాయకులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు సంపల్లిలో చేపట్టిన సర్వేను పరిశీలించారు. బీసీలందరు ఎలాంటి అపోహలు లేకుండా సర్వేకు సహకరించి సిబ్బందికి పూర్తి వివరాలు అందజేయాలని సూచించారు. సర్వే ఆధారంగానే భవిష్యత్‌లో బీసీలకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని, తప్పుడు ప్రచారాలను నమ్మకుండా వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు బస్వరాజ్, వెంకటయ్య, నరేష్, చంద్రశేఖర్ గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

పదో రోజుకు చేరిన సమగ్ర సర్వే

దామరగిద్ద: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే శుక్రవారం పదవరోజు ముమ్మరంగా కొనసాగుతుంది. మండలంలోని 30 పంచాయతీలో 112మంది ఎన్యూమరేటర్లు, 10మంది సూపర్‌వైజర్‌లు సర్వేలో పాల్గొన్నారు. సర్వే బృందాలను సూపర్‌వైజర్‌లు పర్యవేక్షణ చేస్తున్నారు.

స్వామియే శరణం అయ్యప్ప



ఆత్మకూర్: ప్రముఖ వేదపండితుడు గోపాలకృష్ణమూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక అయ్యప్పస్వామి లయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షలు స్వీకరించారు.

హింసను ఖండిస్తున్నాం

మహబూబ్‌నగర్ రూరల్: వికారాబాద్ జిల్లా లగచర్లలో రైతులపై పోలీసుల మూడో డిగ్రీ హింసను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎ.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అమానుష చర్యలు ప్రభుత్వం ప్రతిపాదించిన ఫార్మా విలేజ్ కోసం వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన శాంతియుత నిరసన తర్వాత చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు.

నిమ్మగ్రాసం సాగు నిల్

- దిగుబడి రాక ముందే కనుమరుగైన పంట
- లాభాలు లేక తొలగించిన రైతులు
- అవగహన కల్పించడంలో అధికారులు విఫలం
- పల్లెగడ్డలో వృథాగా 'నిమ్మగడ్డి మిషన్'



కన్మూర్‌లో సాగుచేసిన నిమ్మగ్రాసం సాగు (ఫైల్)



పల్లెగడ్డలో వృథాగా నిమ్మగడ్డి మిషన్ (ఫైల్)

మరికల్: రెండేళ్లలో నిమ్మగడ్డి సాగు వెయ్యి ఎకరాల లక్ష్యం అయితే క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం కావడంతో 2023లో 30 ఎకరాల్లో సాగుచేసిన నిమ్మగడ్డి 2024లో సాగుచేసిన మొత్తం పంటను రైతులు తొలగించారు. మండలంలో 30ఎకరాల సాగుచేసిన నిమ్మగడ్డి సాగు ప్రస్తుతం ఒక ఎకరా సాగు కూడా లేకుండా పొయిందంటే అది ఉన్నతాధికారుల వైఫల్యమనే చేప్పుకోవాలి.

మొదట మరికల్‌లోనే సాగు..

కలెక్టర్‌గా హరిచందన ఉన్న సమయంలో వరికి ప్రత్యామ్నాయంగా నిమ్మగడ్డి పంటను మొదట మరికల్ మండలంలో రైతులకు పరిచయం చేశారు. ఈ పంట సాగుచేస్తే వచ్చే లాభాలపై రైతులకు వివరించడంతో మండలంలో 30ఎకరాల వరకు సాగు విస్తరించింది. సుగంధ ద్రవ్యాల పంటలైన నిమ్మగ్రాసం సాగుపై అప్పటి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖాల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో రైతులకు పంటసాగుపై అధికారులు అవగాహన నిర్వహించారు. కలెక్టర్ హరిచందన బదిలీ కావడంతో ఆ తర్వాత వచ్చిన అధికారి నిమ్మగడ్డి సాగుపై ప్రత్యేక శ్రద్ధ కల్పించకపోవడంతో ఈ పంట కనుమరుగైంది.

పల్లెగడ్డలో వృథాగా 'నిమ్మగడ్డి మిషన్'

నిమ్మగ్రాసం కోతకు వచ్చిన తర్వాత మిషన్‌కు వేసేందుకు మండలంలోని పల్లెగడ్డలో రూ. 6 లక్షల నిధులతో అధికారులు నిమ్మగ్రాసం యూనిట్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. కేవలం ఆరు నెలలు మాత్రమే కోతకు వచ్చిన నిమ్మగడ్డిని కోతవేసి మిషన్‌లో నూర్పిలు చేసి సుగంధ ద్రవ్యాలను తీశారు. పంటపై అవగాహన లోపించడంతో పల్లెగడ్డలో రూ. 6లక్షల విలువ చేసే నిమ్మగడ్డి మిషన్ వృథాగా పడి ఉంది.

ముందుకు రావడం లేదు..

నిమ్మగ్రాసం పంట సాగుపై రెండేళ్లపాటు రైతులకు అవగాహన కల్పించాం. జిల్లాలో మొదట మరికల్ మండలంలో సాగు చేయించాం. కోతకు వచ్చిన పంటను నూర్పిలు చేసేందుకు పల్లెగడ్డలో యూనిట్‌ను ఏర్పాటుచేశాం. రైతులు ఆసక్తి చూపకపోవడమే కాకుండా సాగుచేసిన పంటను కూడా తొలగించడంతో ఈ పంటను సాగు చేయొద్దని విరమించుకున్నాం.

\- పరశురాం, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యనారాయణ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రత నియమాలపై శుక్రవారం సాయంత్రం వాహనదారులకు అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు మాట్లాడుతూ... వాహనదారులు మద్యపానం తాగి వాహనాలు నడపొద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతోపాటు జైలుకు వెళ్లాల్సివస్తుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. టూ వీలర్స్‌పై ఇద్దరికి మించి ప్రయాణం చేయొద్దని, డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని చెప్పారు. ప్రజలు సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని, వారు చూపే మోసపూరిత ఆశలకు గురికావొద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఆంజనేయులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు



నారాయణపేటలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కోస్గి: ప్రభుత్వం ఏర్పాటుచేసి నిర్వహిస్తున్న గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే భాండాగారాలని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ఇంకా ఏవైన పుస్తకాలు అవసరమైతే కొనుగోలు చేసి అందుబాటులో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణహరి, గ్రంథాలయ నిర్వాహకుడు మాసుల నర్సింహులుతోపాటు పలువురు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శనకు చక్కటి స్పందన

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనకు చక్కటి స్పందన లభించింది. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వివిధ రకాలైన పుస్తకాలను ఏర్పాటు చేయగా, పెద్ద ఎత్తున విద్యార్థులు, యువతి యువకులు, ఉపాధ్యాయులు సందర్శించారు. వారుమాట్లాడుతూ.. నిత్యం పాఠ్యపుస్తకాలతోపాటు గ్రంథాలయంలోని వివిధ రకాలైన పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎస్. శిల్ప, సిబ్బంది రఘు, శ్రీకాంత్, ట్రస్మ అధ్యక్ష కార్యదర్శులు ఎండీ ఖదీర్, రాజేష్, మనస్వీ, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవ సమ్మేళనం జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న యాదవ సంఘం సభ్యులు

మరికల్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించే సదర్ ఉత్సవ సమ్మేళాన్ని జయప్రదం చేయాలని యాదవ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రఘువీర్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏర్పాటుచేసిన యాదవ సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని నిర్వహించే సమ్మేళనానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరితోపాటు తదితర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. రాజేష్, రాజు, గోపాల్, కృష్ణయ్య, చిన్నయ్య, చెన్నకేశవులు, నాగులుయాదవ్, విజయ్ పాల్గొన్నారు.

గ్రూప్–4 ఉద్యోగానికి నలుగురు ఎంపిక



బి.నందిని



బి. కల్యాణ్‌రెడ్డి



భాస్కర్‌రెడ్డి



దయాకర్‌గౌడ్

మక్తల్: గ్రూప్ -4 ఫలితాలలో మండలంలోని కర్ని గ్రామం నుంచి ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన బి. నందిని మైనార్టీ గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా, కల్యాణ్ ఎడ్యూకేషన్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా, ఇదే గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి ఓపెన్ క్యాటగిరిలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికవడంతో గ్రామస్తులు అభినందించారు.

- మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మారుతిగౌడ్ కుమారుడు దయాకర్‌గౌడ్ గ్రూప్–4 ఫలితాల్లో ఓపన్ క్యాటగిరిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం సాధించడంపై పలువురు అభినందించారు.

ఊట్కూరు: గ్రూప్–4 ఫలితాలలో మండలంలోని ముగ్దంపూర్ గ్రామానికి చెందిన జెంజర్ల నర్సింహులు, శంకరమ్మ కూతురు స్వేత ఉద్యోగం సాధించి తన సత్తా చాటారు. మంచి మార్కులు రావడంతో జిల్లా కేంద్రంలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో స్టోర్‌కీపర్‌గా విధుల్లో చేరారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న బాధగౌని మానస

పాన్‌గల్: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని షైన్ ఏ లైఫ్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ బాధగౌని మానస అన్నారు. మండలంలోని చింతకుంట గ్రామంలో ట్రస్ట్, గ్రామ యువత ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల ముగింపు సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన తాడిపర్తి జట్టుకు రూ.50 వేలు నగదు, మెమోంటో అందజేశారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని, గ్రామీణ ప్రాంతాల్లోని యువత చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను విజయవంతం నిర్వహించిన గ్రామ యువతకు ఆమె అభినందనలు తెలిపారు. అనూష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన కరపత్రాలు విడుదల



మాలల సింహగర్జన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ కళాభవన్‌లో మాలల సింహగర్జన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కో–చైర్మన్ నర్సింహయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆగస్టు 1న ఇచ్చిన తీర్పును నిరసిస్తూ డిసెంబర్1న పరేడ్ గ్రౌండ్‌లో 10 లక్షల మందితో మాలల సింహగర్జన చేపట్టనున్నట్లు తెలిపారు. మాలల ఆత్మగౌరవం కోసం తెలంగాణ రాష్ట్రంలో మాలలు లేరని తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు మాలల శక్తి ప్రదర్శన చేయబోతున్నామన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు ఎవరు లబ్ది పొందారో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను నిలిపేయాలన్నారు. 2014 నుంచి నేటి వరకు రాష్ట్రంలో పెరిగిన ఎస్సీ జనాభా ప్రకారం 15 శాతం నుంచి 22 శాతానికి రిజర్వేషన్ పెంచాలన్నారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేసే ప్రక్రియ ఇంతవరకు ఎందుకు ప్రారంభించలేదో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కానుగడ్డ యాదయ్య, రాష్ట్ర కో–చైర్మన్ కేశవులు, నాయకులు కంచిమి లక్ష్మణ్, బాలరాజు, కర్ణ, రమాకాంత్, కృష్ణయ్య, చెన్నకేశవులు, రాములు, రమేష్, మద్దిలేటి, భోజరాజు, నారాయణ, చెన్నయ్య, మాసయ్య, శివకుమార్, సహదేవ్, గోవింద్, బాలరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.